
www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 25 ఆగస్టు 2024

5

తిరుపతి



ప్రచార ఆర్భాటం

తిరుపతిపై పట్టుకై ఆరాటం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

తిరుపతి నియోజకవర్గం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దీనికి రాష్ట్రంలోనే ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు ఎవరికి వారు ఆయా పార్టీల తరపున పావులు కదుపుతారు. ఈ దఫా ఏఎన్‌డి అధికారంలోకి రావడంతో మూడు పార్టీలు ఒకరికొక్కరు పోటీపోటీగా వ్యూహాలు పన్నుతున్నారు. కానీ ఎంఎల్‌ఏ కుటుంబ సభ్యులు మరో అడుగు ముందుకేసి నియోజకవర్గం తమ అదుపాజ్ఞల్లో ఉండాలని పథకం వేశారు. అందుకు ఎంఎల్‌ఏ కుమారుడి పుట్టినరోజున వేదికగా చేసుకుని, నియోజకవర్గం యువతను తమ వైపు తిప్పుకునేలా ప్రచార ఆర్భాటానికి తెరలేపి పట్టుకై వ్యూహాత్మకంగా వ్యవహరించడం గమనార్హం.

తిరుపతి నియోజవర్గం తిరుమల శ్రీవారి పాదాల చెంత ఏర్పడిన ప్రాంతం. దేశ విదేశాల నుంచి ప్రముఖులు స్వామివారి దర్శనార్థం వస్తుంటారు. రాష్ట్రపతి మొదలుకుని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు వరకు అందరూ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం నిత్యం వస్తుండడంతో ఇది ప్రముఖ విఐపి కేంద్రంగా నిలిచింది. ప్రోటోకాల్ ప్రకారం ఏ వివిఐపి వచ్చిన తిరుపతి ఎంఎల్‌ఏ స్వాగతం పలకడం, కలుసుకోవడం పరిపాటే. తిరుపతి ఎంఎల్‌ఏ అంటే జాతీయస్థాయి నాయకులకు సైతం సుపరిచితులుగానే ఉంటారు. అంతటి ప్రాముఖ్యత ఉండడంతో ఈ నియోజకవర్గంపై ఎంఎల్‌ఏ కుటుంబ సభ్యులు పెత్తనం కోసం పరితపిస్తారు. గత రెండు మూడు దశాబ్దాలుగా ఇదే జరుగుతోంది. గతంలో మాజీ ఎంఎల్‌ఏ మబ్బురామిరెడ్డి ఎంఎల్‌ఏగా ఉన్నప్పుడు అతని కుమారులు మబ్బు దేవనారాయణరెడ్డి, మబ్బు చెంగారెడ్డి, తర్వాత చదలవాడ కృష్ణమూర్తి ఎంఎల్‌ఏగా ఉన్నప్పుడు అతని బామ్మర్ది ఎన్‌వి.ప్రసాద్, వెంకటరమణ, సుగుణమ్మ ఎంఎల్‌ఏగా ఉన్నప్పుడు వారి అల్లుడు సంజయ్, కరుణాకర్‌రెడ్డి ఎంఎల్‌ఏగా ఉన్నప్పుడు అతని కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి, ఇలా నియోజకవర్గం ఎంఎల్‌ఏ కుటుంబ సభ్యులు పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటూ ఓ దశలో పరిపాలన వ్యవహారాల్లోనూ పాలుపంచుకుని, అధికారులపై ఆజమాయిషీ చెలాయించేందుకు పాకులాడుతారు.

ఇటీవల జరిగిన ఎన్నికల ఏఎన్‌డి కూటమి తరుపున జనసేన పార్టీకి చెందిన ఆరణి శ్రీనివాసులు తిరుపతి ఎంఎల్‌ఏగా గెలుపొందారు. మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మకు తిరుపతి టిడిపికి పెద్దదిక్కు. ఆమెను కాదని టిక్కెట్ జనసేనకు ఇవ్వడంతో కొంత కినుకు వహించింది. ఫలితాలనంతరం నియోజకవర్గాన్ని తమ గుప్పెట్లో ఉంచుకునే ప్రయత్నం ప్రారంభించారు. పట్టుకోసం టిడిపిలోనే మూడు వర్గాలు ఏర్పడ్డాయి. మరో పక్క బిజెపి కూడా గ్రూపుల కడుతూ ముందుకెళ్లుతోంది. జనసేనలో సైతం మూడు గ్రూపులు ఉండడంతో ఎవరికి వారు నియోజకవర్గంపై పట్టు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. నెల క్రితం ఏకంగా ఎంఎల్‌ఏ అన్న కుమారుడు కార్పొరేషన్‌లోకి వెళ్లి కమీషనర్ ఎదుటే కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, అన్ని తనకు తెలియజేయాలనే వ్యవహరించడం వివాదస్పదంగా మారింది. దీంతో ఎంఎల్‌ఏ కుటుంబ సభ్యులు కొన్ని రోజులు వెనక్కి తగ్గారు. గత వారం ఎంఎల్‌ఏ కుమారిడి పుట్టిన రోజు రావడంతో దాన్ని అడ్డు పెట్టుకుని నగరంలో ప్రచార ఆర్భాటానికి తెరలేపారు. నగర వ్యాప్తంగా సుమారు 500 నుంచి 600 బ్యానర్లు ఏర్పాటు చేశారు. వందకుపైగా భారీ ఫ్లెక్సీలు పెట్టారు. అన్ని ప్రధాన కూడళ్లో యువతను ముందుపెట్టి పుట్టిన రోజు వేడుకలు చేశారు. తిరుపతిలో గతంలో ఎన్నడు జరగని విధంగా ఓ ఎంఎల్‌ఏ కుమారిడి పుట్టిన రోజు నాడు నగరంలో 14 చోట్ల ఏకకాలంలో అన్నదానాలు, వస్త్రదానాలు, పండ్లు దానం, ఇంటి పరికరాలు పార్టీ అనుచరుల ద్వారా పంపిణీ చేసి విస్తృత ప్రచారం చేశారు. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన ఆయన కుటుంబానికి ఎంఎల్‌ఏ కుటుంబం మొత్తం దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేసి, చివరికి ఎంఎల్‌ఏ ఇంటిలో తేనీటి విందు ఇచ్చి, బర్తడే సంబరాలు జరిపించి, మెగా కుటుంబంలో తమ సత్తా ఏపాటిదో చూపించారు. కడప, అన్నమయ్య జిల్లా పర్యటనకు తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వద్ద కూడా తమ కుటుంబ సభ్యులతోనే స్వాగతం చెప్పించి, తిరుపతి జనసేన పెద్దదిక్కు నేను అనేలా ఎంఎల్‌ఏ వ్యూహాత్మకంగా ముందుకెళ్లారు. తిరుపతి నియోజకవర్గంపై పట్టుకై ఎంఎల్‌ఏ కుటుంబ సభ్యులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, ఇతరులకు, కూటమి పార్టీలకు అంచెలంచెలుగా చెక్ పెడుతున్నారు. పలువురు మిత్ర పక్ష సభ్యులే బహిరంగంగా విమర్శలు చేస్తుండడం గమనార్హం. పెత్తనం కోసం పాకులాడేకంటే ప్రజాసమస్యలపై చొరవ చూపి, పరిష్కరిస్తే ప్రజల్లో మంచి పేరు రావడం ఖాయం. ఆ దిశగా రాజకీయ నాయకులు వ్యవహరించాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు సూచిస్తున్నారు.

'స్వామి మా మీద దయ చూపు..'

హోమంతో నిరసన



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం వెంకటేశ్వర స్వామి పటాలు నెత్తిన పెట్టుకొని హోమం చేయడం జరిగింది. గోవిందా గోవిందా మా సమస్యను పరిష్కరించండి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడుతూ గత నిరసన దీక్షలు చేపట్టి నేటికి నాలుగు రోజులు పూర్తవుతున్న టిటిడి యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అనేక సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదన్నారు. రాత్రింబవళ్లు నిరసన దీక్షలో కూర్చొని దోమల లెక్క చేయకుండా అనారోగ్యానికి గురవుతున్నా చిరు వ్యాపారస్తుల గురించి టీటీడీ యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. శ్రీవారి మెట్టు మార్గంలో నడుస్తున్న భక్తులకు అందుబాటులో ఉన్న శ్రీవారి మెట్టు వ్యాపారస్తులను దించేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. గత 20 సంవత్సరాల నుంచి ఆ మార్గంలో వెళుతున్న భక్తులకు అనేక రూపాలుగా సేవలు చేయడం జరిగిందని కాబట్టి తమ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మల్లి సోను, మొగిలప్ప రాంబాబు, గణేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేయకండి: మేయర్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరపాలక పరిధిలో జరుగుతున్న పెద్ద కాలువల్లో పూడికతీత పనులు త్వరగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్, హెల్త్ అధికారులను నగర మేయర్ డాక్టర్ శిరీష ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని జరుగుతున్న చిన్న, పెద్ద మురుగు కాలువల్లో పూడికతీత పనులను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. శనివారం ఉదయం 27వ డివిజన్ పరిధిలోని హెడ్ పోస్ట్ ఆఫీస్, గంగమ్మ గుడి ఆర్చ్ వద్ద కాలువల్లో పూడికలను త్వరగా తొలగించాలని ఇంజనీరింగ్, హెల్త్ అధికారులను ఆదేశించారు. మీడియాతో మేయర్ మాట్లాడుతూ ముందస్తు చర్యలుగా రాబోయే వర్షాకాలంలో ఎక్కడ కాలువల్లో నీరు నిలవకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా రూ.90లక్షల వ్యయంతో నగరపాలక పరిధిలోని చిన్నకాలువలు, పెద్ద కాలువల్లో సిల్ట్ (పూడికలు) వ్యర్థాలు తొలగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు పాటించాల్సింది విషయం ఏమిటంటే కాలవల్లో వ్యర్థాలు వేయకుండా ఉండాలని కోరారు. ప్రతిరోజు నగరపాలక ఇంటి వద్దకే వాహనాలు వస్తున్నాయని, తడి, పొడి చెత్త వేరు వేరు చేసి సిబ్బందికి అందించాలని, అలాగే ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ తో పాటు శానిటరీ సూపర్వైజర్ సుమతి, డీఈ రాజు, సచివాలయ సిబ్బంది గోపాలకృష్ణ, పల్లవి, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నమ్మ పాల్గొన్నారు.

తిరుమలలో దళారీ వ్యవస్థను రూపుమాపండి: సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుమల కొండపై దళారీ వ్యవస్థ వేళ్లూనికుని పోయిందని, ఎన్ని సంస్కరణలు చేపడుతున్నామని అధికారులు, ప్రభుత్వం ప్రకటించినా కొత్త రూపంలో ఈ వ్యవస్థ పుట్టుకొస్తూనే ఉన్నదని తాజా ఉదాహరణలు వెల్లడి చేస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆరోపించారు. అన్ని పనులకు స్వామిని వస్తువుగా వాడుకోవడం, అవినీతి పెచ్చరిల్లి పోవటం తదితర కారణాల రీత్యా ఈ పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. తిరుమల కొండపై దళారీ వ్యవస్థ ఎంత బలంగా ఉందంటే స్వయంగా మంత్రులను సైతం మీ లేఖలు ఇవ్వండి... నెలకు రూ.15 నుంచి 20 లక్షలు చెల్లిస్తామని చెప్పే స్థాయికి వెళ్లారంటే వీరి పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. తిరుమల కొండపై దళారీలు ఏ స్థాయిలో ఉన్నా వారిని ప్రాసిక్యూట్ చేయాలని, దళారీ వ్యవస్థను రూపుమాపటానికి పారదర్శకత ఒకటే మార్గమని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల జెఇఓ కార్యాలయానికి ఏ ఎమ్మెల్యే, ఏ మంత్రి, ఏ ముఖ్యమంత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిల్లో ఉన్నటువంటి ఏ కార్యాలయం నుంచి ఎన్ని సిఫార్సు లేఖలు వస్తున్నాయి అనే విషయాన్ని ప్రతిరోజు వెల్లడించడం ద్వారా వీటిని అరికట్టడానికి సాధ్యమవుతుందని తెలిపారు. మొదటి నుంచి తాము ఈ డిమాండ్‌ను చేస్తున్నా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం మౌనంగానే ఉన్నాయని పారదర్శకత పాటించకుండా, దళారీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం ఏ రకంగానూ సాధ్యం కాదని తక్షణం చర్యలు చేపట్టాలని కందారపు మురళి సూచించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతి పై సమీక్ష



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతి పై తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సమీక్షించారు. శనివారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు ఇప్పటికే ఆలస్యం అవుతున్నదని, త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఐ ట్రిపుల్ సి ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరగనుందని అన్నారు. పర్యవేక్షణ లోపంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయని అన్నారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా చేయాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా అనుకున్న మేర పనుల పూర్తి చేయాలన్నారు. స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అశ్లీలతకు అడ్డుకట్ట వేస్తేనే మహిళలకు రక్ష

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: సామాజిక మాధ్యమాల్లో నిత్యం దర్శనమిస్తున్న అశ్లీలతకు అడ్డుకట్ట వేస్తేనే సమాజంలో మహిళలకు రక్షణ ఏర్పడుతుందని క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఫౌండర్ కే. సుందర్ రాజన్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు అకాడమీ కార్యాలయంలో శనివారం మహిళలపై లైంగిక దాడులు, సామాజిక మాధ్యాల్లో అశ్లీలతపై క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుందర్ రాజన్ మాట్లాడుతూ సోషల్ మీడియా, మొబైల్ పోన్లలో వస్తున్న అశ్లీల దృశ్యాలు, సమాచారం కారణంగా ప్రస్తుతం మహిళలపై ప్రస్తుతం లైంగిక దాడులు మరింత పెరిగాయనీ, పసికందుల నుంచి పండు ముదసళ్ల వరకు అత్యాచారాలకు గురయ్యారంటూ అందుకు సంబంధించిన ఘటనలను ఉదహరించారు. అదేవిధంగా కలకత్తా, శ్రీకాళహస్తి ఘటనలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రతకవసరమైన చట్టం, సామాజిక మాధ్యమాల్లో అశ్లీలతను అరికట్టడానికి 15 రోజుల ఉద్యమం చేస్తున్నామనీ, దేశ ప్రధానిని కలిసి విన్నవించునున్నట్లు తెలిపారు. అన్వర్ బాషా, మీర్జాన్ సాహెబ్, ఇస్మాయిల్, కరీముల్లా, రఫాయేళ్, రమేష్, భాస్కర్, దేవ సహాయం, కోగిల ధర్మయ్య, కొండయ్య, యోహాన్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సహాయ పౌర సంబంధాల అధికారిగా గోపి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో సహాయ పౌర సంబంధాల అధికారిగా గోపి శనివారం భాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న గోపికి సహాయ పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి కల్పిస్తూ తిరుపతి కార్యాలయంలో ఖాళీగా ఉన్న స్థానంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, కడప వారు పోస్టింగ్ ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు శనివారం ఉదయం తిరుపతి సహాయ పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

స్విమ్స్‌లో వైద్యురాలిపై రోగి దాడి

రక్షణ కల్పించాలంటూ డాక్టర్ల ధర్నా



స్విమ్స్ అత్యవసర విభాగం ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్విమ్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా డాక్టర్ పై ఓ రోగి దాడి చేసే గాయపరిచిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. దీంతో వైద్యులందరూ విధులు బహిష్కరించి అత్యవసర విభాగం ఎదుట ధర్నా చేపట్టారు. వైద్యుల సమాచారం మేరకు స్విమ్స్ అత్యవసర విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా వైద్యురాలిపై, అక్కడే డిహైడ్రేషన్ సెంటర్లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి హఠాత్తుగా పరిగెత్తుకుంటూ వచ్చి వైద్యురాలు జుట్టు పట్టుకొని, పక్కనే ఉన్న టేబుల్ కేసి బాదాడు. ఈ ఘటనలో వైద్యురాలి తలకి గాయమై రక్తశ్రామయింది. పక్కనే ఉన్న వైద్యులు సిబ్బంది అప్రమత్తమై వెంటనే రోగిని పట్టుకుని, వైద్యురాలుని అతని భారి నుంచి విడదీశారు. ఈ ఘటనతో కోపద్రోహులైన వైద్యులు స్విమ్స్, శ్రీ పద్మావతి మహిళా కళాశాల వైద్యశాలలో విధులు బహిష్కరించి, అత్యవసర విభాగానికి చేరుకొని, ప్రధాన ద్వారం ముందు బయట నుంచి ధర్నా చేపట్టారు. కోల్‌కత్తా జీఆర్ కార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా స్విమ్స్, రుయా ఆసుపత్రి జూనియర్ వైద్యులు 12 రోజులు పాటు నిరసన వ్యక్తం చేసి, శుక్రవారం విరామం ప్రకటించారు. ఆ మరుసటి రోజే స్విమ్స్‌లో ఈ ఘటనతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యురాలి మాట్లాడుతూ వైద్యులు, వైద్యురాళ్లపై దాడి నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం హాస్పిటల్‌లో వైద్యురాలికి జరిగిన అవమానం గురించి ఫిర్యాదు చేసిన, ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. మానసిక రోగులు, బీపీ రోగులు, ఇతర రోగుల మధ్య తాము నిరంతరం విధులు నిర్వహించాలని, వారు పరిస్థితి సరిగా లేదని చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే, దాడుల కొనసాగుతూనే ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ వైద్యులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా తమకు న్యాయం చేయాలని గట్టిగా నినాదించారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుకు, ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. వెంటనే బహిర్గపరచాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేసేందుకు ఆయన వెనుతిరిగి వెళ్ళిపోయారు. విషయం తెలుసుకున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ అత్యవసర విభాగానికి చేరుకొని, అక్కడి అధికారులను జరిగిన పరిణామాలు గురించి అడిగి తెలుసుకున్నారు. స్విమ్స్ అధికారుల సమాచారంతో అలిపిరి పోలీసులు అక్కడికి వైద్యాధికారులతో చర్చించారు. టిటిడి ఈవో స్విమ్స్‌కు వచ్చి తమకు రాతపూర్వకంగా హామీ ఇచ్చే వరకు ధర్నా కొనసాగిస్తామని వైద్యులు భీష్మించుకున్నారు. వైద్యులు సుమారు నాలుగు గంటలు పైగా ధర్నాను కొనసాగించడంతో రోగులు కాస్త అసౌకర్యానికి గురయ్యారు. డాక్టర్ల ఆందోళన రాత్రి కూడా కొనసాగుతోంది.

చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజలు సహకరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా పకడ్బందీగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో సమన్వయంతో జిల్లాలో సజావుగా ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ కోరారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న వరసిద్ధి వినాయక ఉత్సావాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, ఎస్పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి మునిసిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ, నిర్వాహకులు తదితరులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని అన్నారు. తిరుపతి నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ వారు టీటీడీ సహకార సమన్వయంతో వినాయక నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని, అందరూ సహకరించాలని అన్నారు. ఎమ్మెల్యే, మేయర్, ఎస్పీ మాట్లాడుతూ మునిసిపల్ కార్పొరేషన్ వారు వినాయక సాగర్‌లో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని, శానిటేషన్, క్లోరినేషన్, పారిశుధ్యం చక్కగా ఉండాలన్నారు. నీటిలో బ్యారికెడింగ్ పక్కాగా ఏర్పాటు ఉండాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. విగ్రహాల నిమజ్జనం రూట్ వారీగా వారికి డేట్, టైం కేటాయించి సక్రమంగా జరిగేలా చూడాలని అన్నారు. సమావేశ ప్రారంభానికి ముందు శ్రీవరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రతిసారీ జరుగుతుందని, అలాగే చుట్టూ పక్కల మూడు చెరువులలో కూడా నిమజ్జనం చేస్తారని, 3, 5 రోజులు, 9 రోజులు, 11 రోజులలో నిమజ్జనం జరుగుతాయని, ఎక్కువ శాతం 3 రోజులకు నిమజ్జనం చేస్తారని అన్ని శాఖలు సహకరించాలని కోరారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషన రావు, తుడా సెక్రెటరీ వెంకట నారాయణ, ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, కమిటీ ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, భాను ప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, ఆర్.సి మునికృష్ణ, మాగంటి గోపాల్ రెడ్డి, గుండాల గోపి నాథ్, అజయ్ పాల్గొన్నారు.

'అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి'



సత్యవేడులో..

ప్రజాశక్తి- సత్యవేడు: కల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సత్యవేడు డివిజన్ కమిటీ విద్యార్థి సంఘ నాయకులు మురళి, నాగార్జున ఆధ్వర్యంలో దళవాయి అగ్రహారం పోలీస్ చెక్ పోస్ట్ నుండి గోడ గడియారం కూడలి వరకుర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలు తీయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యాచారానికి పాల్పడిన నిందుతులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకి దేశంలో మహిళలపై అత్యాచారం పెరిగిపోతుందని ప్రత్యేక చట్టాన్ని తెచ్చి వైద్యులకు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

నాగలాపురం: అత్యాచారానికి పాల్పడిన నిందితుడిను కఠినంగా శిక్షించాలి సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆశా వర్కర్లు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు కవిత, జిల్లా కోశాధికారి సుజాత, ఎం.రమేష్, ఎన్.నాగరాజు, ఆర్.మురుగేష్ పాల్గొన్నారు.

రేణిగుంట: కోల్‌కత్తా జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనకు నిరసనగా తిరుపతి జిల్లా ప్రైవేటు టీచర్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రేణిగుంటలో కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీని అంబేద్కర్ సర్కిల్ నుండి బస్టాండ్ గాంధీ బొమ్మ వరకు నిర్వహించారు. ర్యాలీలో జిల్లా ప్రెసిడెంట్ అశోక్ నాయుడు, జిల్లా కార్యదర్శి పాండు, వైస్ ప్రెసిడెంట్ కరాటే కుమార్, రాజు, బాబూలాల్, సాలెహ, రియాజ్, సమీవుల్లా, గాబ్రియల్ పాల్గొన్నారు.



నాగలాపురంలో..

శ్రీసిటీని సందర్శించిన డిపి ఐఐటి జాయింట్ సెక్రటరీ

ఐఆర్‌ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) జాయింట్ సెక్రటరీ సంజీవ్ ఐఆర్ఎస్ శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రముఖ ఎయిర్ కండీషనర్ బ్రాండ్ల ఉనికి, బలమైన సరఫరా గొలుసుతో దేశంలో అగ్రగామి కేంద్రంగా శ్రీసిటీ వేగంగా ఎదుగుతోందని చెప్పారు. శ్రీసిటీ అత్యుత్తమ మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రశంసించిన సంజీవ్, ఇది ఆత్మనిర్భర్ భారత్ చొరవకు చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. శ్రీసిటీ పర్యావరణ స్నేహపూర్వక విధానాలను కూడా ప్రశంసించారు. ఇవి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు, సామాజిక–ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కఠినమైన పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూ పర్యావరణాన్ని రక్షించేందుకు రూపొందించబడ్డాయని తెలిపారు. తన సందర్శనలో భాగంగా డైకిన్, అంబర్, ఈ పాక్, బ్లూస్టార్, హవెల్స్, మాగ్నమ్ ఎయిర్ కండీషనర్ తయారీ కేంద్రాలను సందర్శించారు. కంపెనీల కార్యకలాపాలను పరిశీలించారు.

ఐఆర్‌ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం..

ఇండియన్ రబ్బరు మెటీరియల్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఐఆర్‌ఎంఆర్ఐ)కు సంబందించిన రబ్బరు, టైర్ రీసెర్చ్ ల్యాబ్ ఆర్‌టిఆర్ఎల్‌ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంజీవ్ పాల్గొన్నారు. ఐఆర్ ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఐఆర్‌ఎమ్ఆర్ఐ బృందాన్ని అభినందిస్తూ, రబ్బరు, టైర్ రీసెర్చ్ ల్యాబ్ స్థాపన శ్రీసిటీ సహజ సిద్ధమైన వ్యవస్థను బలపరిచే గొప్ప ఆస్తిగా మారుతుందని, ఈ ప్రాంతంలోని ఆటోమోటివ్, టైర్ , రబ్బరు తయారీ పరిశ్రమలకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.


దివ్య దర్శనం టోకెన్ల జారీ కేంద్రంలో ఈవో తనిఖీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో దివ్య దర్శనం, ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ కేంద్రాన్ని శనివారం టిటిడి ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి పరిశీలించారు. అలిపిరి వద్ద భక్తులకు ఇది వరకు జారీ చేస్తున్న దివ్యదర్శనం టోకెన్లను పునఃప్రారంభించేందుకు సాధ్యసాధ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్ఎస్‌డి టోకెన్ల జారీ ప్రక్రియను, క్యూ లైన్లను, ఎస్వీబిసి మాస్టర్ కంట్రోల్ రూమ్‌ను, ఎస్వీబిసి పాత పరిపాలన భవనాన్ని పరిశీలించారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా టోకెన్లు జారీ చేయడానికి శాశ్వత క్యూలైన్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరువాత అలిపిరి పాదాల మండపం వద్ద ఇదివరకు దివ్య దర్శనం టోకెన్ల జారీ కేంద్రాన్ని, టిటిడి జలప్రసాదాన్ని, లగేజీ కౌంటర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈవో వెంట జేఈఓ వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్వో శ్రీధర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు

భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు : టీటీడీ ఈవో



సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఈవో

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, పురటాసి మాసం కూడా వస్తున్నందువల్ల భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. అన్నివిభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంలతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో అక్టోబరు 4న ధ్వజారోహణం ఉంటుందని, అదేరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. గరుడవాహనసేవ సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమవుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేయడం జరిగింది. సుమారు ఏడు లక్షల లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచుకోవడం జరుగుతుంది. టిటిడి నిఘా, భద్రతా సిబ్బంది, జిల్లా పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు. గరుడసేవకు ప్రత్యేకంగా అదనపు భద్రత, నిత్యం కామన్ కమాండ్ సెంటర్ ద్వారా భద్రత పర్యవేక్షణ, వార్షిక బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుమల, తిరుపతిలలో పలు ఇంజినీరింగ్ పనులు చేస్తున్నామన్నారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ దీపాలంకరణలు, వాహనసేవలు వీక్షించేందుకు మాడ వీధుల్లో గ్యాలరీలు, పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు కాటేజి దాతలకు గదుల కేటాయింపు ఉండదని, తిరుమలలో గదుల లభ్యత తక్కువగా ఉన్నందున, తిరుమలలో గదులు లభించని భక్తులు తిరుపతిలో బస చేయాలని కోరుతున్నామన్నారు. కల్యాణకట్ట, ఇతర మినీ కల్యాణకట్టలలో క్షురకులు నిరంతరాయంగా భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి, అదనపు సిబ్బంది ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లలో అన్నప్రసాదం, పాలు, అల్పాహారం వితరణ, తిరుమలలోని అశ్వని ఆసుపత్రి, వైకుంఠం క్యూకాంప్లెక్సుల్లోని వైద్య కేంద్రాలు, డిస్పెన్సరీలతో పాటు పలు ప్రథమ చికిత్స కేంద్రాలు, మొబైల్‌క్లినిక్, అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 4,000 మంది శ్రీవారి సేవకులు, తిరుమలలోని అన్ని విభాగాల్లో భక్తులకు సేవలందిస్తారని, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా వాహనసేవల ప్రత్యక్ష ప్రసారం, ఫొటో ఎగ్జిబిషన్, ఫలపుష్ప ప్రదర్శనశాల, ఆయుర్వేద, శిల్ప ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబరు 8న గరుడసేవ సందర్భంగా ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకల రద్దు చేయడమైనదని, అలిపిరి పాత చెక్‌పోస్టు, శ్రీవారిమెట్టు వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా, పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు చక్కటి సేవలందించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సిద్ధమవుతున్నాయని వివరించారు. అంతకు ముందు ఈవో ఇంజినీరింగ్ పనులు, అన్నప్రసాదం, దర్శనం, వసతి, పోలీసు, కళ్యాణకట్ట, రవాణా, హెచ్‌డిపిపి, ఉద్యానవనం, వైద్యం, ఆరోగ్యం, శ్రీవారి సేవకుల సమన్వయంతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సివి అండ్ ఎస్వో శ్రీధర్, ఎఫ్‌ఎసిఎవో బాలాజి, సిఈ నాగేశ్వరరావు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, వివిధ శాఖాధిపతులు, పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన సర్పంచులు



ఎస్ఐని సన్మానిస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో శనివారం ఉదయం కొత్తపాలెం సర్పంచ్ హరిప్రసాద్, పారలపల్లి సర్పంచ్ ఎం చలపతి, బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐగా బాధ్యతలు విశ్వనాథ నాయుడుని శనివారం కలిసి పుష్పగుచ్ఛం సన్మానించారు. మండలంలోని వైసిపి నాయకులు గురునాథం, మణి నాయుడు, కిరణ్ యాదవులు ఎస్ఐని కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టు టౌన్ సిఐగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు టుటౌన్ పట్టణ సిఐ గా శ్రీనివాస్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు విజిలెన్స్ నుండి బదిలీపై గూడూరు టు టౌన్ సిఐగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలకు కట్టుబడి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే చట్టవ్యతిరేక చర్యలు చేపడతామన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల వంకమద్దివారిపల్లికి చెందిన విద్యార్థి అనంత హిమకర్ మంచి మార్కులు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు సదాశివరెడ్డి, శ్రీహరి, వెంకటరమణ శనివారం తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అనంత హిమకర్‌కు హైస్కూలు తరఫున 12 వేల రూపాయలు ఆర్థిక సాయం విద్యార్థి తండ్రి శ్రీనివాసులకు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదువుకుని అభివృద్ధి చెందుతున్న పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సాయం చేసి వారి అభివృద్ధికి దోహదపడడం గర్వంగా వుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్, గోవిందయ్య, సురేంద్ర, ప్రభావతి, మునిరత్నమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబి పురం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో శనివారం విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం, డిప్యూటీ ప్రభాకర్ రాజు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించేలా చూడాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులపైన ఉందన్నారు. ప్రతి రోజూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కలిసి భోజనం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఐటి పోటీల్లో శేషసాయి విద్యార్థుల హవా



పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి ఐఐటి స్పేస్ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలు (డ్రాయింగ్, క్విజ్, వైజ్ఞానిక ప్రదర్శన)ల్లో శేషసాయి విద్యార్థులు హవా చూపి బహుమతులు పొందారు. ఈ పోటీలకు రాష్ట్రం నలు మూలల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వీరితో పాటు శేషసాయి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రకటించిన ఫలితాల్లో శేషసాయి 9 వ తరగతి విద్యార్థిని యశశ్విని డ్రాయింగ్‌లో ద్వితీయ బహుమతి, 7 తరగతి విద్యార్థి వెంకట చరిష్మ వైజ్ఞానిక ప్రదర్శనలో రెండవ బహుమతి సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డైరెక్టర్ డాక్టర్ రమేష్, సన్మద్దుల్ని చేసిన కరస్పాండెంట్ ఎఎన్ సంజీవరావు, వి పిసుపాదం, కెఎస్ మహాలక్ష్మి ఎంతో కృషి చేశారు. ఏ సుబ్బయ్య, బి జయ ప్రకాష్, కె మనోజ్, ఎన్ శారదా నరసింహన్ బహుమతులు అందుకున్న విద్యార్థులను అభినందించారు.

14న లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వచ్చేనెల 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయ వాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు , సీనియర్ సివిల్ జడ్జి ఎస్ఎస్‌రాఘవేంద్ర మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దాని పై అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చునని, క్రిమినల్ కేసులను కూడా రాజీ చేసుకోవచ్చున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి జానకి మాట్లాడుతూ ప్రతి న్యాయవాది కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ సమావేశం లో పుత్తూరు పోలీస్ శాఖ. సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డిఈఐసి చిన్నపిల్లల కేంద్రంలో మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి హరికిరణ్ ఆదేశించారు. శనివారం డిఈఐసి చిన్నపిల్లల కేంద్రానికి వచ్చిన కమిషనర్‌కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యు శ్రీహరి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన డిఈఐసి చిన్నపిల్లల కేంద్రంలో రికార్డులను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా వారికి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె డాక్టర్ పద్మావతి, డిఎంఓ రూపకుమార్ , డెమో బాబు నెహ్రూ రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం సాయంకాలం అనుమతి లేని వాహనాలను ఎస్ఐ విశ్వనాథ నాయుడు తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో భాగంగా అనుమతులు లేని ద్విచక్ర వాహనాలను ఆటో వాళ్ళను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ రమేష్ బాబు శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

రేపు ఎంజిఎంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఎంజిఎం ఆస్పత్రిలో ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాతలు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 08578-2999972 లేదా 7288877300 లేదా 7288877308 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఖాట్మండు వర్సిటీతో మహిళా వర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఖాట్మండు విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మధ్య కుదిరిన ఎంఓయులో భాగంగా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ టీం మహిళా వర్సిటీని శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా వీసి ఆచార్య వి ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజని, రెక్టార్, అంతర్జాతీయ వ్యవహారాల డీన్ పి విజయ లక్ష్మి , ఇంటర్నేషనల్ మెంబర్స్‌తో మాట్లాడుతూ ఫ్యాకల్టీ, ఇంజనీరింగ్ ఫార్మసీ, బయోటెక్నాలజీ, సోషల్ వర్క్, ఇంగ్లీష్ లిటరేచర్, క్రాఫ్ట్ విభాగాలలో స్టూడెంట్ మొబిలిటీ, ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ,జాయింట్ సెమినార్స్, వర్క్ షాప్స్, కొలాబరేటివ్ ప్రాజెక్ట్ చేయడానికి ఎంతో ఆస్కారం వుందని వివరించారు.

నష్ట పరిహారం అందించండి..

తహశీల్దారుకు అరుంధతీయులు వినతి

ప్రజాశక్తి -కోట: సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం కోల్పోయిన తమ భూమికి వచ్చే నష్ట పరిహారాన్ని అందించేందుకు సహాయం చేయాలని బాధితులు కోరారు. శనివారం కోట మండలంలోని స్థానిక కోట తహశీల్దారు కార్యాలయంలో గూడలి అరుంధతీయ కుటుంబానికి చెందిన పలువురు తహశీల్దారు కటారి జయఖుజు రావుకు కలిసి 448 సర్వే నంబర్ లోని 4.52 సెంట్లు భూమికి 1.23 సెంట్లు భూమికి నష్టపరిహారం అందేలా సహాయ చేయాలని సూరిపాక వెంకటరమణయ్య కుటుంబ సభ్యులు తహశీల్దారును వేడుకున్నారు. వారి కుటుంబ సభ్యులు గుంటక రమణయ్య, గోవింద పుల్లయ్య, గుంటక సుబ్బమ్మ మాట్లాడుతూ గూడలి గ్రామంలోని 448 సర్వే నెంబర్ లో ఉన్న 4.52 సెంట్లు భూమిలో 1.23 సెంట్లు భూమికి సాగరమాల రహదారి వచ్చే పరిహారం మంజూరు చేయాలని కోరారు. పరిశీలించి న్యాయం చేస్తామని తహశీల్దారు బాధితులకు తెలిపారు.

శెట్టిపల్లి రోడ్డు నిర్మాణ పరిధి కుదింపు?

- సకాలంలో పూర్తికాని పనులు
- అడుగడుగునా అవాంతరాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గం నుండి రేణిగుంట మార్గానికి అనుసంధానంగా మంగళం రవాణా శాఖ కూడలి నుండి టిటిడి నిధులతో నిర్మితమవుతున్న 80 అడుగుల రోడ్డు నిర్మాణం అడుగులలో కుదించనున్నారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఎన్నో ఏళ్ల నాటి స్థానిక ప్రజల కల, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న చర్యకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి నిధులతో తిరుమలకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం, నగరపాలక సంస్థలో విలీనమైన శెట్టిపల్లి గ్రామ ప్రజలకు, మంగళం పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండాలని ఉద్దేశంతో రూ.15.12 కోట్ల రూపాయలను పాలక మండలిలో ఆమోదింప చేసి పనులు ప్రారంభించారు. అయితే రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న గుత్తేదారు రోడ్డు వెడల్పు కోసం, అక్కడక్కడా డ్రైనేజీల నిర్మాణం, తెలుగు గంగ లీకేజీలతో రోడ్డు నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. కొంతకాలం తర్వాత తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు అక్కడక్కడా ఉన్న లీకేజీలను పరిష్కరించారు. నూతనంగా నిర్మిస్తున్న శెట్టిపల్లె మార్గానికి విద్యుత్తు స్తంభాలను, లైనులను ఏర్పాటు చేశారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న వృక్షాలను కూల్చివేసి గ్రావెల్‌తో చదును చేశారు. అయితే 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన నిర్ణయాన్ని



పక్కన పెట్టేస్తున్నారా? అని విమర్శలు వినిపిస్తున్నాయి.

దాదాపు పూర్తయినా..?

శెట్టిపల్లి-రేణిగుంట మార్గాన్ని కలుపుతూ నిర్మిస్తున్న 80 అడుగుల రోడ్డు పనులతో పాటుగా ప్రారంభమైన రేణిగుంట రోడ్డు మార్గంలోని నారాయణాద్రి హాస్పిటల్ పక్కనే చెన్నై జాతీయ రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న 4 లైన్ల రోడ్డు ఇప్పటికే దాదాపు పూర్తి అయ్యింది. కాంట్రాక్టు గడువు ముగిసినా శెట్టిపల్లి మార్గం నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయక పోవడంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షపై టిటిడి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఎసెన్షియా యాజమాన్యం తీరుపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి -సత్యవేడు: ఎసెన్షియా యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి బాధిత కార్మికుల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు మెలుగు రమేష్, నాగలాపురం నాగరాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఫార్మా ఎసెన్షియా కంపెనీలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే రియాక్టర్ పేలి కార్మికులు మృత్యువాత పడ్డారని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యమే కారణ మన్నారు. బాధితుల కుటుంబానికి సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో చని పోయిన, క్షతగాత్రులై జీవనోపాధిని కోల్పోయిన ప్రతి కార్మిక కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరుతో ఏ విధమైన సేఫ్టీ ఆడిట్, తనిఖీ జరగకపోవడం వల్లే ఈ ప్రమాదం నెలకొందని ఎద్దేవా చేశారు. ఎసెన్షియా యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. సత్యవేడులో పారిశ్రామిక వాడ నెలకొన్న సందర్భంగా కార్మికుల భద్రత దృష్ట్యా పరిశ్రమలలో తరచూ సేఫ్టీ ఆడిట్, తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

అంతరిక్ష విశేషాలు తెలుసుకోవాలి

భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అంతరిక్ష విశేషాలు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు, భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా పిల్లలను తీర్చిదిద్దేందుకు భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తోందని భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి తెలిపారు. జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరు రమణమ్మ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వం ఫొటో ఎగ్జిబిషన్ 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు నుండి విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగం సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆగస్టు 23వ తేదీ భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తోందని తెలిపారు. మొదటి అంతరిక్ష దినోత్సవ సందర్భంగా గూడూరులోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో మూడు రోజులపాటు ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా అంతరిక్ష విశేషాలు, శాస్త్రవేత్తల పరిశోధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తీసుకొచ్చి ప్రదర్శనను తిలకించాలని కోరారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే శాస్త్ర, సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని, అంతరిక్ష విశేషాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, అధ్యాప కులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

అండగా ఉంటాం.. ఆందోళన వద్దు..

- వైసిపి శ్రేణులకు నేదురుమల్లి భరోసా

ప్రజాశక్తి-వెంకటగిరి: 'ఐదేళ్లలో మనం ఎప్పుడూ దౌర్జన్యాలు చేయలేదు..టిడిపి వర్గీయులు వైసిపి శ్రేణులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని అందరికీ తాను అండగా వుంటానని ధైర్యంగా వుండాలని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో శనివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్ , డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన వైసిపి శ్రేణులు అధైర్య పడవద్దని, తాను అండగా వుంటానని..టీడీపీ దుర్మార్గాలను న్యాయస్థానాల ద్వారా ధైర్యంగా ఎదుర్కొందామని నేదురుమల్లి భరోసా కల్పించారు. అందరికీ అందుబాటులో ఉంటా నని తెలిపారు. నాయకులను ఆయన పేరు పేరునా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నేదురుమల్లిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, కె కళ్యాణి, పి లక్ష్మి, మాజీ కౌన్సిలర్ రొంటాల చిన్నా, నాయకులు వి కార్తికరెడ్డి, పి జగన్మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కె రాజారెడ్డి, రాజారెడ్డి, సదారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, సురేంద్ర, ప్రభాకర్‌బాబు, బాబీ, భాస్కర్ రెడ్డి, చింతపట్ల మురళి వున్నారు.



వైసిపి కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

మెరుగైన విద్యే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. కెవిబిపురం మోడల్ స్కూలులో ప్రజా ప్రగతి ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు శనివారం సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని, విద్యార్థులు సైతం ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకో వాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతర విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సైన్స్ కిట్‌లు పంపిణీ చేశారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ నిర్వాహకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిపిటి ఛైర్మన్ శ్రీనివాసులు, మైక్రో ఫైనాన్స్ ఛైర్మన్ సుధీర్ గాంధీ, ఐఎల్‌పి ప్రోగ్రాం ఇన్‌ఛార్జి సుస్మిత దేవేంద్ర, పిపిటి సిబ్బంది సుబ్రహ్మణ్యం, చెంచురామిరెడ్డి, చంద్రశేఖర్, వేణుగోపాల్, ఈశ్వరయ్య, గంగయ్య, పుత్తూరు డివైఈఓ ప్రభాకర్ రాజు, తహశీల్దారు దస్తగిరయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి టీచర్లు, విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి టిడిపి మండల అధ్యక్షుడు రామంజిల్ నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

సైన్స్ కిట్లు, లైబ్రరీ బుక్స్ అందజేసిన పిపిటి సిబ్బందికి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంని ఘనంగా సన్మానించామని యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఏ హేమంబరధరరావు తెలిపారు. విద్యార్థులకు ప్రయోగాలు చేసేందుకు ఈ సైన్స్ కిట్లు ఎంతో ఉపయోగపడుతాయని మండలంలోని కొన్ని పాఠశాలలకే సైన్స్ కిట్ల లైబ్రరీ ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే చర్యలు తీసుకుని ప్రతి పాఠశాలకు లైబ్రరీ ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రగతి ట్రస్ట్ వారి విద్యాసామగ్రి చాలా బాగుందని ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వై పురుషోత్తం, జిల్లా అకాడమిక్ కన్వీనర్ వి నరసింహులు, జిల్లా ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ ఓ మునయ్య, మండల సహాధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్ నాయకులు వై ధర్మ రాజుల రెడ్డి, పి మురళీధర్, అంజూర్ హెడ్మాస్టర్ సుందరం, కార్యకర్తలు పి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమైన భూములతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ఓజిలి : ఆరోగ్యమైన సాగు భూములతోనే రైతులకు అధిక దిగుబడులు వస్తాయని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య అన్నారు. మండల కేంద్రంలో భూసార యాజమాన్యంపై ఆర్‌బికె కార్యాలయం వద్ద శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. భూములకు అధికంగా రసాయనాలు వాడకం వల్ల మేలు చేసే సూక్ష్మజీవులు అంతరించిపోతున్నాయని తెలిపారు. భూములకు విరివిగా సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడకం వల్ల భూములలో జీవాన్ని పెంచవచ్చునని చెప్పారు. భూసార పరీక్షల ద్వారా భూముల ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చునని తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వాడిన సాగు ఖర్చు తగ్గి అధిక ఆదాయం వస్తుందన్నారు. భూసార పరీక్షలను గ్రామ స్థాయిలలో రైతు సేవా కేంద్రంలోని విస్తరణ సిబ్బంది ద్వారా ఉచితంగా చేసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి తెలిపారు. పంట పెట్టిన రైతులు ఈ పంట నమోదు తప్పక చేసుకోవాలని ఆమె కోరారు. రైతులకు శ్రమ, కర్చు తగ్గించే నానో ఎరువుల వాడకం గురించి ఇఫ్‌కో జిల్లా మేనేజర్ లక్ష్మీ నారాయణ వివరించారు. వరి సాగులో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు వివరించారు. ఆయిల్ పామ్ సాగు గురించి నాయుడుపేట ఉద్యాన అధికారిణి శారద వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోవిందయ్య, రైతులు , గ్రామ వ్యవసాయ సహాయకురాలు భావన , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

టాస్క్ ఫోర్స్ వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద వున్న టాస్క్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ క్యాంటీన్(ఫుడ్ కోర్ట్)ను శనివారం టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి ఎల్ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ బృందాలు ప్రత్యేక ఆపరేషన్‌తో బాగా పనిచేస్తున్నాయని కొనియాడారు. క్యాంటీన్ నిర్మాణానికి సహకరించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్ తో పాటు రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ అధికారులతో ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహించడానికి పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్ ఆర్ఐ లు కే.సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులు, కృపానంద, సీఐ సురేష్ కుమార్, ఎఫ్ ఆర్ ఓలు మురళీ కృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



టాస్క్ ఫోర్సు వెల్ఫేర్ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి

తెలుగు రాష్ట్రాల్లో టైల్స్ ఎడ్హెసివ్ ప్రత్యేక ఉత్పత్తులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పిడిలైట్ ఇండస్ట్రీస్ నుండి ప్రముఖ టైల్స్ ఎడ్హెసివ్ బ్రాండ్ అయిన రాఫ్ తమ కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్ణాటక మార్కెట్లలో అధిక నాణ్యత కలిగిన టైల్ ఎడ్హెసివ్ ఉత్పత్తుల కోసం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి ఈ సదుపాయం తోడ్పడనుందని పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పూరి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్‌లలో ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తులకు డిమాండ్ పరంగా, టైల్, స్టోన్ ఫిక్సింగ్‌ను ఆధునీకరించాలనే మా లక్ష్యంకు అనుగుణంగా మా కొత్త ప్రాజెక్ట్ ఉందన్నారు. వినియోగదారులకు మేలైన ఎడ్హెసివ్ పదార్థాలను అందించడం, తయారీని మార్కెట్‌లకు చేరువ చేయడం మా లక్ష్యం.." అని అన్నా రు. పిడిలైట్ ఇండస్ట్రీస్ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా, జీరో-వేస్ట్ ప్లాంట్‌గా పని చేస్తుంది. 80 శాతం సౌరశక్తితో నడు స్తుంది.. నిర్మాణ రసాయనాల రంగంలో పర్యావరణ అనుకూల తయారీకి కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తుందన్నారు. అధునాతన ఆటోమేషన్‌తో కూడిన ఈ ప్లాంట్ ఉత్పత్తిలో ఖచ్చితత్వం, స్థిరత్వం, నాణ్యత, సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది.. మా ఉత్పత్తులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గ్రామ స్వరాజ్య స్థాపనే కూటమి లక్ష్యం: జనసేన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతం కావడం కూటమి ప్రభుత్వ మొదటి విజయమని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఆపార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు తెలిపారు. గూడూరు నియోజకవర్గ జనసేన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి జరిగిన 13,326 గ్రామసభలు విజయవంతం కావడంతో జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయన్నారు. తమ తమ గ్రామాల సమస్యల పరిష్కారాల కోసం ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయం, ఆలోచన, కార్యచరణ మేరకు దశాబ్దాల తర్వాత రాష్ట్రంలోని కొన్ని వేల గ్రామాలలో జరిగిన గ్రామసభల విశిష్టత, ప్రాధాన్యం, సాధికారతను నేటి యువత, ప్రజలు తెలుసుకున్నారన్నారు. గ్రామ సభలలో గ్రామాల సమస్యలు, పరిష్కారం మాత్రమే కాదు.. చేపట్టిన అభివృద్ధి పనుల లిస్టును పంచాయతీ కార్యాలయంతో పాటు, ప్రముఖ కూడలిలో కనిపించేలా బోర్డులు పెట్టాలని, ఏదైనా అభివృద్ధి గురించిన అంశంలో లోటుపాట్లు జరిగితే, వెంటనే సదరు అభివృద్ధి కార్యక్రమం చేసిన కాంట్రాక్టర్ల గ్రామాల ప్రజలు నిలదీసేలా ఉండాలని, అప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశం లో పీఓసీ మోహన్, నాయకులు నాగార్జున ఇమ్రాన్ సాయి కిరణ్ హరి, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. విజయపురానికి చెందిన షరీఫ్ కుమార్తె దిల్షాద్‌కు పెళ్లయి పిల్లలు వున్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం వుంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఏ పరిణామాలు చోటుచేసుకున్నాయో ఏమో పిచ్చాటూరు బజారు వీధుల్లో మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్‌ని ఢీకొన్న లారీ

ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - ఓజిలి : స్కూటర్ ని లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఓజిలి మండలంలోని రాజుపాలెం 16వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రమైన ఓజిలి బీసీ కాలనీకి చెందిన గోనీపల్లి రవి (35) ఓజిలి నుండి ఏపీ 40 సిఎఫ్ 2,100 స్కూటీపై గూడూరు వైపు వెళుతున్న సమయంలో ఢిల్లీ నుండి చెన్నైకి వెళుతున్న ఎన్‌ఎల్ 01క్యూ 9056 నెంబర్ కలిగిన లారీ రాజుపాలెం వద్ద పెట్రోల్ బంక్‌లో డీజిల్ పట్టుకుని రాంగ్ రూట్లో వస్తున్న సమయంలో స్కూటర్ పై వెళుతున్న రవిని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. రవి మృతితో బీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పి రవిబాబు ఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పది మంది స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-అలిపిరి రోడ్డు మార్గంలోని చెర్లోపల్లి వద్ద శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న పది మంది స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి ఏడు పిడిలేని గొడ్డళ్లు, వారు ప్రయాణించిన కారు, ఒక మోటారు సైకిల్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ టీ.విష్ణువర్ధన్ కుమార్ బృందం తిరుపతి అర్బన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం అలిపిరి రోడ్డు మీద చెర్లోపల్లి వద్ద కొంతమంది కారు నుంచి దిగుతుండడాన్ని గమనించిన టాస్క్‌ఫోర్సు బృందం వారిని చుట్టుముట్టి ప్రశ్నించగా ఎర్రచందనం కోసం అడవుల్లోకి వెళుతున్నట్లు గుర్తించారన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొన్నామన్నారు. వీరు తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన బాబు , బాల మురుగన్ , ప్రభు , కందస్వామి , రమేష్ , కృష్ణ మూర్తి , మణికంఠ , కార్తీ , రామ్ కుమార్ రజనీకాంత్ లుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం కోబాక దళిత వాడకి చెందిన గురవమ్మ (53) శనివారం వడదెబ్బకు గురైంది. ఆమె ఉపాధి హామీ పనులకు వెళ్లింది. గత 15 రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమె శనివారం వడదెబ్బకు గురైంది. ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి వస్తూ మార్గమధ్యంలో సొమసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం రేణిగుంట వద్ద ఉన్న బాలాజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.

తాగునీటి వివాదం పరిష్కారం

ప్రజాశక్తి - ఓజిలి : ఎట్టకేలకు తాగునీటి వివాదం పరిష్కారమైంది. గత నెల రోజులుగా మండల కేంద్రంలోని ఒక ప్రాంతానికి రాజకీయాల వివాదాల కారణంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. అంతే కాకుండా మహిళలు ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గ్రామ సభలో సైతం మహిళలు నిరసన వ్యక్తం చేయడంతో గ్రామసభ తాగునీటి సమస్యపై రసాభాసగా మారి అర్ధాంతరంగా నిలిచిపోవడమే కాకుండా గ్రామ సభ ముందుకు సాగకుండా మహిళలు అధికారులను నిలదీశారు. దీంతో తాగు నీటి రాజకీయ గ్రహణానికి తెర పడింది. అధికారులు, పంచాయతీ సిబ్బంది ఎట్టకేలకు తాగునీటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి పైప్ లైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటిని ఇళ్లకు సరఫరా చేయడంతో రాజకీయ గ్రహణం వీడింది. తాగు నీటి సరఫరా చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మెగా రక్త దాన శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తిరుపతి రుయా ఆస్పత్రి పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో సంయుక్తంగా శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చాలామంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రమాదాలు బారిన పడుతున్నారని కొంత మంది పేదవారు రక్తం లేకుండా చనిపోతున్నారని వారికి సహాయం చేయడానికి ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో తమ విద్యార్థులు రక్తదానం చేశారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు పది మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం అధికారి డాక్టర్ దివ్య, ఛైర్మన్ అశోకరాజు, ప్రిన్సిపాల్స్ జానా రాజు , టీమ్, ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, రమేష్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సురేష్, ప్రసాద్, రవిబాబు ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని నీరువాయి ఎంపిపి స్కూలులో విద్యార్థులకు ఛైర్మన్ శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకుంటే ఉన్నత శిఖరానికి చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుగ్రప్రియ వెంకటేష్, టిడిపి సత్యవేడు ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అరుల్ ప్రకాష్, ఢిల్లీ, నాగేంద్రబాబు, ఆరుముగం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు తగవు: సురేంద్ర నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జగన్ వ్యవహార శైలిని భరించలేక కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని, అలాంటి కూటమి ప్రభుత్వంపై వెకిలి నవ్వులు నవ్వే జగన్ విమర్శిస్తే ప్రజలు ఊరుకోరని తిరుపతి పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఫార్మా కంపెనీలో జరిగిన ఘటనపై బాధితులకు ఎటువంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం భరోసా కల్పించిందని, మాజీ ముఖ్యమంత్రిగా బాధితులను పరామర్శించడానికి వెళ్లిన జగన్మోహన్ రెడ్డి కాలిన గాయాలతో ఉన్న రోగుల వద్ద వెకిలి నవ్వులు నవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కరాటే చంద్ర, ఆముదాల తులసీరామ్, శ్రీరాములు, జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రతో భేటీ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీందర్ తిరుమల పర్యటన నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో శాలువాతో సత్కరించి విమానాశ్రయంలో వారితో ప్రత్యేక భేటీ అయి నూతన మద్యం పాలసీ ప్రజలకు అనుకూలంగా ఉండాలని రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మంత్రిని కోరారు. నూతన ఉచిత ఇసుక పాలసీ ప్రజలకు ఉపయోగకరంగా వుండాలని మంత్రిని కోరారు. ప్రభుత్వంలో బీసీలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత , తదితర అంశాల గురించి చర్చించారు. అనంతరం వీడ్కోలు పలికారు.

వర్సిటీని చంద్రబాబు అభీష్టం మేరకు తీర్చిదిద్దండి:టిడిపి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి, వర్సిటీ పూర్వ విద్యార్థి చంద్రబాబు అభీష్టం మేరకు, మానవ అభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ బాబు ఆశయాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని మాజీ తుడ ఛైర్మన్, తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షుడు నరసింహ యాదవ్ విసిని కోరారు. ఆయన వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావుని, ఆచార్య మాదాల భూపతి నాయుడుని శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో గత ఐదు సంవత్సరాలుగా చోటుచేసుకున్న అవినీతిని వెలికి తీసి చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీలోని విద్యా బోధనకు వసతులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. వర్సిటీలో కఠిన సమస్యలు ఉంటే తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టరు పి హరికృష్ణ యాదవ్, డాక్టరు పత్తిపాటి వివేక్, డాక్టరు రాంబాబు, డాక్టరు శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.